# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సాయుధ దళాల సిబ్బందికి రెండో విడత శౌర్య పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ ఈరోజు ప్రదానం చేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీషెల్స్ దేశ పర్యటన ముగించుకొని భారత్ కు తిరుగు పయనమయ్యారు.
- దేశ ఆరోగ్య వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేశామని కేంద్రమంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు.
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా 300 గిగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు.

==================================

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ సాయుధ దళాల సిబ్బందికి ప్రతిష్ఠాత్మక శౌర్య పురస్కారాలను ఈరోజు ప్రదానం చేశారు. దేశ రక్షణలో అసాధారణ ధైర్యం, అంకితభావం, విశిష్ట సేవలు అందించిన సైనికులు, భద్రతా సిబ్బందిని ఈ పురస్కారాలతో సత్కరించారు. ఎయిర్ మార్షల్ తరుణ్ చౌధరి, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్మ, లెఫ్టినెంట్ జనరల్ వికాస్ రోహెల్లా, లెఫ్టినెంట్ జనరల్ హర్బిందర్ సింగ్ వంద్రా, లెఫ్టినెంట్ జనరల్ మోహిందర్ పాల్ సింగ్‌లకు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రెండో విడత శౌర్య పురస్కారాల ప్రదానోత్సవంలో అతి విశిష్ట సేవా పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు కేంద్ర మంత్రులు, సాయుధ దళాల ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

==================================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీషెల్స్ దేశ పర్యటన ముగించుకొని భారత్ కు తిరుగు పయనమయ్యారు. సీషెల్స్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అనేక కీలక ఫలితాలను అందించిందని ప్రధానమంత్రి ఒక సామాజిక మాధ్యమ ప్రకటనలో తెలిపారు. గత 50 సంవత్సరాల్లో భారత్, సీషెల్స్ దేశాల మధ్య సంబంధాలు ప్రగాఢమైన విశ్వాసం, పరస్పర సహకారం, ఉమ్మడి అభివృద్ధిపై ఆధారపడి కొనసాగాయని చెప్పారు.

రాబోయే 50 సంవత్సరాలు ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి, పరస్పర శ్రేయస్సు ఆధారంగా రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ, ఆ దేశ ప్రభుత్వం, ప్రజలు చూపించిన ఆత్మీయతకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్–సీషెల్స్ మధ్య ఉన్న స్నేహం, విశ్వాసం భవిష్యత్‌లో మరింత విస్తరించనుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆరోగ్య వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేశామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయిలో ఆరోగ్య సేవలను విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మండలి 16వ సమావేశం ఆయన అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీ వేదికగా జరిగింది. ఈ సందర్భంగా జేపీ నడ్డా ప్రసంగిస్తూ... పౌరులకు, ఆరోగ్య సేవల వ్యవస్థకు మధ్య అనుసంధాన కేంద్రాలుగా పనిచేసేలా దేశవ్యాప్తంగా లక్షా 86 వేల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

అంతకుముందు  ఆరోగ్య సేతు యాప్ 2.0 ను జేపీ నడ్డా ప్రారంభించారు .. దీంతో ఒకే యాప్‌లో ఇకపై ఆభా (ABHA) ప్రొఫైల్, ఆరోగ్య రికార్డులు, పీఎం-జేఏవై సేవలు, సమీప ఆసుపత్రుల వివరాలు లభ్యం కానున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ లోని వడోదరలో “వైబ్రంట్ గుజరాత్” ప్రాంతీయ సదస్సు ఈరోజు ప్రారంభమయ్యింది. సదస్సును కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్.. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మనోహర్ లాల్... దేశ పారిశ్రామిక వృద్ధికి విద్యుత్ రంగం కీలక ఆధారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. బలమైన ప్రణాళికలు, ముందస్తు ఏర్పాట్ల కారణంగా ఈ వేసవిలో దేశం రికార్డు స్థాయిలో 271 గిగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను విజయవంతంగా తీర్చగలిగిందని తెలియజేశారు. 2014లో దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 236 గిగావాట్లు ఉండగా... ప్రస్తుతం అది 542 గిగావాట్లకు పెరిగిందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్‌లో డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, కృత్రిమ మేధస్సు (AI) విస్తరణ కారణంగా విద్యుత్ అవసరాలు పెరగనున్న నేపథ్యంలో 300 గిగావాట్ల వరకు డిమాండ్‌ను ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి రెండు రోజుల పాటూ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. విశాఖపట్టణంలో జరిగే కేంద్ర గిరిజన విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవ వేడుకకు రాష్ట్రపతి రేపు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేయనున్నారు. ఆ మరుసటి రోజు అనంతపురంలోని కేంద్ర విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి కూడా రాష్ట్రపతి హాజరవుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామాలు పురోగతి సాధించకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోలేమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. వీబీ జీ-రామ్-జీ చట్టం అమలుకు సంబంధించి అన్ని రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి

శాఖా మంత్రులతో రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళన్ పేరిట న్యూఢిల్లీలో ఈరోజు ఆయన ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... అన్ని రాష్ట్రాల సమిష్టి కృషితోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. వీబీ జీ-రామ్-జీ పథకాన్ని ఎటువంటి జాప్యం లేకుండా అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఆయన స్పష్టం చేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (CBSE) త్రి భాషా విధానానికి సంబంధించి కొత్త మార్గదర్శకాలను ఈరోజు విడుదల చేసింది. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు కొత్త భాషా విధానాన్ని అనుసరించాల్సిన అవసరం లేదని బోర్డు స్పష్టం చేసింది. అలాగే ప్రస్తుతం 7, 8, 9వ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు 10వ తరగతికి వచ్చిన తర్వాత మూడో భాషలో బోర్డు పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదని సీబీఎస్ఈ తెలిపింది. ఈ మార్పులు ప్రస్తుతం చదువుతున్న బ్యాచ్‌లపై తక్షణ ప్రభావం చూపవని పేర్కొంది. ఇప్పటికే 7, 8, 9వ తరగతుల్లో రెండు విదేశీ భాషలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు అదే విధానాన్ని కొనసాగించవచ్చని, అయితే దానికి అదనంగా ఒక భారతీయ స్థానిక భాషను కూడా అభ్యసించాల్సి ఉంటుందని బోర్డు వెల్లడించింది. త్రి భాషా విధానం ద్వారా భారతీయ భాషల ప్రోత్సాహం, భాషా వైవిధ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ మార్గదర్శకాలు రూపొందించినట్లు CBSE పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ-కాశ్మీర్‌లో పవిత్ర అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. 57 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 28న ముగియనుంది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గుహలోని మంచు శివలింగానికి తొలి పూజ నిర్వహించి యాత్ర ప్రారంభ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేక పూజల అనంతరం మనోజ్ సిన్హా విలేకరులతో మాట్లాడుతూ... యాత్రికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జమ్మూ-కాశ్మీర్ పరిపాలనా విభాగం ఆలయ బోర్డ్, సైన్యం, పోలీసులు, భద్రతా బలగాలు, స్థానిక ప్రజలు, సేవా సంస్థలు, స్వచ్ఛంద కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. యాత్ర సజావుగా కొనసాగేందుకు రవాణా, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ఇతర అవసరమైన మౌలిక వసతులను గణనీయంగా పెంచినట్లు చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు కదిలేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. రానున్న మూడు నుంచి నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాలు, జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, ఉత్తరాఖండ్ వైపు విస్తరించే అవకాశం ఉందని పేర్కొంది. వీటి ప్రభావంతో పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాలలో రేపటి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే అరుణాచల్ ప్రదేశ్, అస్సోం, మేఘాలయ, కేరళం, మాహే ప్రాంతాల్లో బుధవారం వరకు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యమునా నదీ జలాల ప్రాజెక్టుపై హర్యానా – రాజస్థాన్ రాష్ట్రాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీ.ఆర్. పాటిల్, హోం మంత్రి అమిత్ షాల సమక్షంలో హర్యానా, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు ఈరోజు న్యూఢిల్లీలో యమునా వాటర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

==================================